క్లుప్తంగా

సీగ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో సీగ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఏగ్రేడ్‌లోకి తీసుకు రావాలని ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం తిరుమలరాజుపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన సిలబస్ పూర్తిచేసి సీగ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

20న చేపల చెరువుల వేలం

వెదురుకుప్పం: మండలంలోని గొడుగుచింత పంచాయతీలోని చేపల చెరువులను ఈనెల 20న వేలం వేయనున్నట్లు గ్రామ కార్యదర్శి మధు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి చెరువు, పుల్లగంగమండడి, పాపన్నగుంట, శ్రీరాముల గుంట చెరువు, తామరాకులగుంట చెరువులను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు గొడుగుచింత పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు ఉంటాయని, ఆసక్తి ఉన్న వారు ముందుగా రూ. 2 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు.

జీతాలు చెల్లించాలని ధర్నా

గంగాధరనెల్లూరు: మండలంలోని ముసలయ్యగారిపల్లె సమీపంలో శుక్రవారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెక్యూరిటీ గార్డులు ధర్నా చేపట్టారు. వివరాలిలా .. ఆరులేన్ల బెంగళూరు–తచ్చూరు రహదారి నిర్మాణ పనులను కేపీసీ ప్రైవేటు లిమిటెడ్ చేస్తోంది. ఇందులో 60 మంది దాకా సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ వారు ధర్నా చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసమూర్తి కలుగ చేసుకుని ధర్నాను విరమింపచేశారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా బాబయ్య

కార్వేటినగరం: ఇన్‌చార్జి మండల విద్యాశాఖ అధికారిగా ఏ.బాబయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈవోగా పనిచేస్తున్న విజయకుమార్ మెడికల్ సెలవుపై వెళ్లారు. నాగలాపురం ఎంఈఓగా పనిచేస్తున్న బాబయ్య జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కార్వేటినగరం ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, అంకిత భావంతో పని చేయాలన్నారు. పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు ఆయనను కలసి సన్మానించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



బెల్ట్, సర్టిఫికెట్‌లు అందజేస్తున్న మాస్టర్ గుణ

పాలసముద్రం : ఆత్మరక్షణ, దేహదారుఢ్యానికి కరాటే ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, కరాటే మాస్టర్ గుణ తెలిపారు. శుక్రవారం పాలసముద్రంలో విద్యార్థులకు జపాన్ షియాటో కరాటే ఇండియా వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనీ ఫైట్ మాస్టర్ రమేష్ పాల్గొన్నారు.

నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ

పుత్తూరు రూరల్: ఆస్తి పన్ను బకాయిలను ఈనెల 31 లోపు చెల్లిస్తే వడ్డీని పూర్తిగా మినహాయింపు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్‌లో, వార్డు సచివాలయాల్లోనూ బకాయిలు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్ https://cdma.ap.gov.in ద్వారా కూడా చెల్లించవచ్చని తెలిపారు. సెలవు దినాల్లోనూ మున్సిపాలిటిలోని కౌంటర్‌లో పన్నులు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

బంగారుపాళెం: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం సిబ్బందితో కలసి రైతు భరో సా కేంద్రాలు, క్షేత్రస్థాయిలో పొలంబడి క్షేత్రాన్ని పరిశీలించారు. తొలుత మండలంలోని పాలేరు లోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొని రబీ సీజన్‌లో పంట నమోదు జాబితా ప్రదర్శన గురించి వివరించారు. రైతులకు పంటల సాగుపై సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. తిమ్మోజుపల్లె ఆర్‌బీకే పరిధిలోని బొమ్మాయిపల్లెలో నిర్వహిస్తున్న పొలంబడి క్షేత్రాన్ని సందర్శించారు. రైతులకు పొలంబడి ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఏవో పద్మజ, ఏఈఓ సాదరయ్య, సిబ్బంది పుష్పాంజలి పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపుల వర్షం



పుత్తూరులో వర్షం నీరు పారేలా కాలువను శుభ్రం చేస్తున్న సిబ్బంది



నగరిలో కురుస్తున్న వర్షం

నగరి : మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వేసవి తీవ్రత నుంచి ఈ వర్షం కాస్త ఉపశమనం ఇచ్చింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. మేతకు పొలాలకు పశువులను తోలుకెళ్లిన వారు ఇక్కట్లు పడ్డారు.

పుత్తూరులో ..

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. జనజీవనం స్తంభించింది. మున్సిపాలిటి 4వ వార్డులో లోతట్టు ప్రాంతమైన భవానీనగర్‌లో అధికారులు ముందస్తు జాగ్రత్తగా ఒరవ కాలువను బాగు చేయడంతో వర్షపు నీరు సజవుగా పారింది. భవానీనగర్ కింద భాగంలో ఉన్న 6వ వార్డుకు చెందిన తాయిమాంబాపురం గ్రామం చెరువులోకి వర్షపు నీరు పుష్కలంగా చేరింది. 15వ వార్డు రామానాయుడు కాలనీ డ్రైనేజీ పొంగి పొర్లుతూ ఇళ్లలోకి నీరు వస్తుండడంతో, మున్సిపల్ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకొని నీటిని యథావిధిగా మళ్లించారు.

ఎస్సార్‌పురంలో..

శ్రీరంగరాజపురం : మండలంలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వేరుశనగ రైతులకు ఈ వర్షం ఊరట నిచ్చింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురుస్తుందని ప్రజలు జగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ షబ్బీర్‌బాషా సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షం సమయంలో చెట్లు కింద ఉండకూడదని, పిడుగులు పడే ప్రమాదం ఉందని తెలిపారు.

కార్వేటినగరంలో ..

కార్వేటినగరం: నియోజక వర్గంలో కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. ఆదివారం వరకు తుపాన్ ప్రభావం ఉంటుందని, బలమైన గాలులు, మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఏపుగా వచ్చిన మామిడి పూత, పిందెలు గాలులకు రాలి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వేసవి ప్రారంభమై రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణ మార్పులతో వర్షం పడడం ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు ఫ్లూ జ్వరాలు, జలుబుతో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రజలు మరింతగా జాగ్రత్తలు పాటించాలి. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి సులభంగా బయటపడవచ్చు. పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఆహారం తీసుకొనే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. జ్వరం మూడు రోజుల పాటు ఉంటే టైఫాయిడ్, డెంగీ జ్వరానికి సంబంధించిన పరీక్షలు చేయించుకుని, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలి.

– శంకర్‌నరేష్, ప్రభుత్వ వైద్యాధికారి, పుత్తూరు

పుత్తూరులో వైఎస్సార్ సీపీ సంబరాలు



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ హరి,, నాయకులు

పుత్తూరు రూరల్: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయం సాధించడంపై పార్టీ స్థానిక నేతలు సంబరాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్ వద్ద బాణసంచా పేల్చారు. సీట్లు పంచిపెట్టారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టిబాబు, మనోహర్‌రెడ్డి, ఈశ్వరయ్యాయాదవ్, మునయ్య, జనార్థన్‌యాదవ్, మోహన్ రెడ్డి, నారాయణరెడ్డి, ఏకాంబరం, తులసీ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు ఆస్పత్రి సేవలు భేష్



క్యాజువాలిటీని పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాలపై క్వాలిటీ అసెస్మెంట్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ జి.శ్రీనివాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం సాయంత్రం పుత్తూరు ఆస్పత్రిని రాష్ట్ర అధికారుల బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రిలో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. క్యాజువాలిటీలో అందుతున్న సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ రాష్ట్ర కన్సెల్టెంట్ కె.రాజాకిరణ్, తిరుపతి జిల్లా కాయకల్ప కన్సెల్టెంట్ హరికృష్ణ, పుత్తూరు ఆస్పత్రి వైద్యాధికారి ఎల్.శంకర్‌నరేష్, హెడ్ నర్స్ దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమల స్థాపనతో ఆర్థికాభివృద్ధి



సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

గంగాధరనెల్లూరు: స్వయం సహాయక సంఘ సభ్యులు కుటీర పరిశ్రమల స్థాపనపై మొగ్గు చూపాలని డీఆర్‌డీఏ పీడీ తులసి సూచించారు. మండలంలోని బొమ్మవారిపల్లెలో కాయర్ బోర్డు(మేట్ల) తయారీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత శిక్షణను సంఘ సభ్యులు వినియోగించుకోవాలన్నారు. శిక్షణానంతరం కుటీర పరిశ్రమను ప్రారంభించి ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించుకుంటే లాభాలు పొందవచ్చన్నారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. అనంతరం కలిజవేడు, పాపిరెడ్డిపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. ఏపీఎం చిరంజీవి, రూరల్‌యాక్షన్ సంస్థ సెక్రటరీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్కూలు వార్షికోత్సవం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకుంటూ చదువులో రాణించాలని తెలిపారు. గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం మాట్లాడుతూ చదువే సంపదని పేర్కొన్నారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సుందరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి



పౌష్టికాహారం పంపిణీ

విజయపురం : మండలంలోని మాధవరం పంచాయతీలో క్షయ వ్యాధిగ్రస్తులకు సర్పంచ్ మమతా చేతుల మీదుగా మండల వైద్యాధికారి సోమశేఖర్ పౌష్టికాహారం అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నిత్యం తీసుకొనే ఆహారంలో మంచి పోషక విలువలు ఉన్న కాయగూరలు, పండ్లు, పాలు తీసుకోవాలన్నారు. క్షయ అంటు వ్యాధి కాదని సూచించారు. ఉప సర్పంచ్ అంగముత్తు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ద్రౌపదీదేవి, ధర్మరాజులస్వామి, శ్రీకృష్ణుడు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. పరిమళభరిత పుష్పమాలికలు,పట్టు పీతాంబరాలతో అమ్మవారిని అలంకరించారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెటీరియల్ అందిస్తున్నా, బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా లబ్ధిదారులు పనులను ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని పేర్కొన్నారు.

నాడు-నేడు పనుల వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాబయ్య

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష ఈఈ మధుసూదనరావు అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి బాబయ్య ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఈఈ మాట్లాడుతూ నాడు–నేడు రెండవ దశలో ఎంపికైన 36 పాఠశాలల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంఈఓ మాట్లాడుతూ నాడు–నేడు నిర్మాణాలు చేపడుతున్న పాఠశాలల్లో మరుగుదొడ్లు రన్నింగ్ వాటర్‌తో ఉండాలని, తాగు నీటి పనులు, విద్యుత్ కనెక్షన్లు, మేజర్, మైనర్ మరమ్మతులను త్వరితగతిని పూర్తి చేయాలని సూచించారు. ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

సరిహద్దులో వాహనాలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ సురేష్

పాలసముద్రం : తమిళనాడు సరిహద్దులోని బలిజ కండ్రిగ–షోలింగర్ జాతీయ రహదారిపై ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలసి శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్రవాహనాలు, టారీ, ఆటోలను ఆపి ఆర్సీ పుస్తకాలు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా వేశారు. కొందరిని అనుమానంపై స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తమిళనాడు సరిహద్దు నుంచి రికార్డులు లేని వాహనాలు వస్తున్నట్లు అందిన ఫిర్యా దుల మేరకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి



ఎల్ఈడీ ప్రొజెక్టర్ గదిని ప్రారంభిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్, ట్రస్టు సభ్యులు

పెనుమూరు(కార్వేటినగరం) : విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు లిటరసీ ప్రాజెక్టు డైరెక్టర్ రంగరాజన్ తెలిపారు. శుక్రవారం పెనుమూరు మండల పరిధిలోని గుడ్యాణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇండియా లిటరసీ ప్రాజెక్టు, ప్రజా ప్రగతి, ఏజీ ఎస్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా రూ.5లక్షలు విలువ చేసే కంప్యూటర్లు, ప్రింటర్లు, సైన్స్ కిడ్స్, లైబ్రరీ పుస్తకాలు, ఎల్ఈడీ ప్రొజెక్టర్, పుస్తకాల ర్యాక్స్, బీరువాలు, మైక్‌సెట్, మినరల్ వాటర్ ప్లాంట్, వంట పాత్రలు, క్రీడా పరికరాలు అందజేశాయి. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ తమ ప్రాజెక్ట్ 12 రాష్ట్రాల్లో వెనుకబడిన పాఠశాలలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన చిత్తూరు ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఏజీఎస్ హెల్త్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ గోవిందం పిళ్లై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలతో పాటు విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జె.లత, సర్పంచ్ ఎం.తులసమ్మ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వినాయకమండడి, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్లు సుస్మిత, శ్రీనివాసులు, దేవేంద్ర,కుమార్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం



నింద్ర :బాలికను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

వడమాలపేట : రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి నిఖిల్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి గైడ్ గజరాజన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఎకో ఫ్రెండ్లీ వాషింగ్ మిషన్ నమూనాను జిల్లా స్థాయి ఉత్తమ జాతీయ ప్రాజెక్టుగా న్యాయనిర్ణీతలు ప్రకటించారు. ఈ ప్రాజెక్టును ఈనెల 23, 24 తేదీల్లో కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఈ పోటీలకు ఎంపికైన నిఖిల్, గైడ్ గజరాజన్‌ను జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ప్రయోగాలు విద్యార్థులు మరెన్ని చేయాలని ఆకాంక్షించారు.

నింద్ర : రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు నింద్ర హైస్కూల్ 10 వ తరగతి విద్యార్థి ఓ.సౌమ్య ఎంపికైందని హెచ్‌ఎం బి.శివయ్య తెలిపారు. శుక్రవారం బాలికను, గైడ్ టీచర్లు సుధాకర్, షరీఫ్, సురేష్‌ను ఉపాధ్యాయ బృందం మెమెంటోతో అభినందించింది. హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ ప్రదర్శనకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

కాకినాడ ఏఎంవీఐపై దాడి సరికాదు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డీటీసీ కార్యాలయ అధికారులు, సిబ్బంది

చిత్తూరు రూరల్: కాకినాడ ఏఎంవీఐ చిన్నారావుపై వ్యక్తి దాడి సరికాదని, అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డీటీసీ కార్యాలయ అధికారులు, సిబ్బంది డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోనిడీటీసీ కార్యాలయం ఎదుట శుక్రవారం వారు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కాకినాడలో కొబ్బరికాయలు అమ్మే వ్యక్తి శుక్రవారం ఉదయం ఏఎంవీఐ చిన్నారావుపై కత్తితో దాడి చేశారన్నారు. తీవ్రంగా గాయపడడంతోపాటు ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందన్నారు.దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఓ మురళి, ఏంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, ఏఎంవీఐ శివకుమార్‌లు, సిబ్బంది విజయకుమార్, చక్రపాణి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న అయ్యప్ప

పాలసముద్రం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందని ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. శుక్రవారం పాలసముద్రం గ్రామ సచివాలయంలో వలంటీర్లకు, ఆరోగ్య సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి నరేష్ సమక్షంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అయ్యప్ప మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి పల్లెను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సమష్టి బాధ్యతని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లతో ఎప్పటికప్పుడు చెత్త సేకరణ నిర్వహించి తడి,పొడి వ్యర్థాలను వేరుచేసి సంపద కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. ఏఎస్ఎం తులసి, వలంటీర్లు పాల్గొన్నారు.